


నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గరుగుబిల్లి


పార్వతీపురంలోని 132 కెవి సబ్ స్టేషన్ నిర్వహణ పనులు కారణంగా మండలంలో మంగళవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఇఇ వివి కిషోర్ తెలిపారు. కావున వినియోగదారులు ఈ విషయం గమనించాలని కోరారు.

కురుపాం : కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాలకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ 132/33కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్న సందర్భంగా సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ అధికారి వివి కిషోర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి అంతరాయానికిని సహకరించాలని కోరారు.

4 వరకూ ఉత్కంఠే

- ఆగని కూడికలు, తీసివేతలు
- నాడు ఓటర్ల చుట్టూ... నేడు గుళ్లు, గోపురాల చుట్టూ ప్రదక్షిణలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ఎన్నికల పోలింగ్ ముగిసినప్పటికీ, గెలుపోటములపై విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎడతెగని ఉత్కంఠ కొనసాగుతోంది. కేవలం అభ్యర్థులు, పార్టీ నాయకుల్లోనే కాదు. ఆయా పార్టీల కార్యకర్తలతోపాటు సాధారణ ప్రజల్లోనూ ఇదే రకమైన చర్చ వినిపిస్తోంది. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. అదే రోజు ఫలితాలు కూడా వెలువడతాయి. విజయనగరం పార్లమెంటు స్థానంలో 15 మంది, పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని అరకు పార్లమెంట్ స్థానంలో 13 మంది, జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాలకు మొత్తం 77 మంది, మన్యం జిల్లా పరిధిలో 4 అసెంబ్లీ స్థానాలకు 31 మంది అభ్యర్థులు తమ జాతకాలను పరీక్షించుకోనున్నారు. ఈ తీర్పులో విజయనగరం జిల్లాలో 12,71,173 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 7,83,440 మంది ఓటర్లు భాగస్వామ్యం కానున్నారు. అభ్యర్థులంతా ఇప్పటికే కూడికలు, తీసివేతలతో కుస్తీపడుతున్నారు. ఎన్ని లెక్కలు వేసుకున్నా ఆ రోజు వరకు వేచిచూడాల్సిందే. పోలింగ్ రోజు వరకు ఓటర్లే దేవుళ్లుగా భావించి వంగి వంగి నమస్కారాలు చేసిన అభ్యర్థులు, వారి తరపు ప్రచారకర్తలు నేడు గెలుపును ఆకాంక్షిస్తూ గుడులు, గోపురాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గడిచిన వారం రోజుల్లో అభ్యర్థులు భక్తిశ్రద్ధలతో ఆలయాలను సందర్శించి అనుగ్రహాన్ని కోరుకుంటున్నారు. కానీ, నిజరూపం ఓట్ల రూపంలో ఇవిఎంల్లో నిక్షిప్తమై ఉంది. ఆయా బాక్సులన్నీ జెఎన్‌టియు-జివి, జొన్నాడ వద్ద లెండి ఇంజినీరింగ్ కాలేజీలో భద్రంగా ఉన్నాయి. అభ్యర్థులు ఊహల పల్లకిలో ఊరేగుతున్నారు. అతినమ్మకంతో ఉన్నవారు విజయోత్సవాలకు కూడా సిద్ధమౌతున్నారు. కేవలం కూటమి, వైసిపి అభ్యర్థులే కాకుండా ఇతర పార్టీలు, స్వతంత్రంగా పోటీచేసిన అభ్యర్థులు కూడా ప్రజావిశ్వాసాన్ని పరీక్షించుకోనున్నారు.

కూటమి, వైసిపి అభ్యర్థుల గెలుపోటములపై పందేలు కూడా జోరుగానే సాగుతున్నాయి. టిడిపి, జనసేన, వైసిపి అభ్యర్థులు ఎవరికి వారే ప్రజలపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నప్పటికీ ఒకరి విజయంతో మరొకరి అపజయం అనివార్యమౌతుంది. ఈనేపథ్యంలో ఇప్పుడు ప్రజలపై విశ్వాసం వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు అదే స్థాయిలో ఓటమిని అంగీకరించే పరిస్థితి ఉంటుందా? లేక ప్రజలపై నిందలు, దాడులకు తెగించే అవకాశం ఉంటుందా? వేచిచూడాల్సిందే. చాలా గ్రామాల్లో ఇప్పటికీ ఎన్నికల వేడి చల్లారలేదు. వాస్తవానికి మన జిల్లాలో ఫలితాల సందర్భంలో అటువంటి సంఘటనలు జరిగిన దాఖలాలు పెద్దగా లేవు. ప్రస్తుతం రెండు జిల్లాల్లోనూ 144 సెక్షన్ అమల్లో ఉంది. కానీ, పోలింగ్ సందర్భంగా ఇతర జిల్లాల్లో జరిగిన అవాంఛనీయ సంఘటనలను దృష్టిలో పెట్టుకుని శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

విత్తనాలు సిద్ధం చేయాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరిపడా విత్తనాలు సిద్ధం చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుతుపవనాలు తొందరగా వచ్చే అవకాశం ఉందని, రైతులకు అవసరమైన విత్తనాలు అధికారులు సిద్ధం చేయాలని తెలపారు. అన్ని పరిస్థితులకు తట్టుకునే 1001 రకం విత్తనాలను మళ్లీ రైతులకు అందించాలని కోరారు. ధాన్యం బకాయిలు రైతులకు వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. జిల్లాలో నీటి వనరులు సద్వినియోగమయ్యేలా ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, చిన్న నీటి వనరుల కింద కాలువల్లో పూడికలు తీసి సాగునీరు చివరి ఆయకట్టుకు అందించాలని డిమాండ్ చేశారు. గతేడాది ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని, మామిడి, జీడి మామిడి పంట దిగుబడి లేకపోవడం వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, రైతులకు, కౌలురైతులకు పంట రుణాలు ఇవ్వాలని, భూ సమగ్ర సర్వేలో సమస్యలు పరిష్కరించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి గోపాలం, బి.రాంబాబు, ఉపాధ్యక్షులు సిహెచ్.జగన్, ఆర్.సత్యం, ఆదినారాయణ, నారాయణరావు, బాపునాయుడు, ఈదుబిల్లి అప్పారావు, గేదెల శ్రీనివాస్, రమణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

విచారణ ఏమైందో?

క్రమబద్ధీకరణకు వసూళ్లపై చర్యలేవీ

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఉన్న సిఆర్టీల క్రమబద్ధీకరణకు వసూళ్లపై ఇంతవరకు ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రాజెక్టు పరిధిలో 131 మంది సిఆర్టీల క్రమబద్ధీకరణ జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులను క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణకు అర్హులైన వారిని ఎంపిక చేశారు. అంతవరకు బాగానే ఉంది. కానీ సిఆర్‌టిల నుంచి ముడుపులు వసూలు చేయడం వివాదాస్పదమయింది. ఒక్కో సిఆర్‌టి నుంచి లక్ష నుంచి లక్షన్నర రూపాయల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐదుగురు సిఆర్టీల ద్వారా వసూళ్ల చేపట్టారనే వాదనలు వినిపించాయి. వారి ఫోన్ పే, బ్యాంక్ ఖాతాలకు లంచం డబ్బులు జమ చేసి తద్వారా అధికారులకు చేర వేసినట్లు తెలుస్తోంది. ఇదంతా జరిగి రెండు నెలలు దాటిపోయింది. ఈలోగా ఎన్నికలు ముంచుకొచ్చిన తరుణంలో ఈ వివాదం కొంత పక్కదారి పట్టింది. ఐటిడిఎ ప్రాజెక్టు కార్యాలయంలో పని చేస్తున్న ఉన్నతస్థాయి అధికారి, మరో గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఈ వసూళ్లకు తెరలేపినట్లు ఆరోపణలు వచ్చాయి. గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర అధికారుల అండదండలతో ప్రాజెక్టు అధికారులు ఈ వసూళ్లు చేపట్టారనేది నగ్నసత్యం. దీనిపై ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ విచారణకు ఆదేశించారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో విచారణ నివేదికపై ఏం చర్యలు తీసుకుంటారనే చర్చ జరుగుతోంది. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

పేదల ఆశాజ్యోతి సుందరయ్య

ప్రజాశక్తి - బలిజిపేట

కమ్యూనిస్టు గాంధీ, దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు, పేదల ఆశాజ్యోతి అయిన పుచ్చలపల్లి సుందరయ్య బాటలో పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. సుందరయ్య 39 వర్ధంతి సభ మండలంలోని చెల్లింపేటలో సిపిఎం మండల నాయకులు గంట్యాడ బలరాం నాయుడు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ సుందరయ్య తన చిన్నతనం నుండే పేదల కోసం పోరాడారని, తన గ్రామంలోనే మొట్టమొదట వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పాటు చేసి వ్యవసాయ కూలీలు, దళితుల సమస్యలపై పోరాడారని తెలిపారు. మహాత్మా గాంధీ స్ఫూర్తితో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. ఆ తర్వాత కమ్యూనిస్టుపార్టీలో చేరి సామ్రాజ్యవాదులు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడారన్నారు. భూమికోసం, భుక్తి కోసం, సామాజిక న్యాయం కోసం తెలంగాణ సాయుధ పోరాటం చేశారన్నారు. దీనికి నాయకత్వం వహించి 10 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారన్నారు. 10వేల గ్రామాలను నైజాం నవాబ్, రజాకార్లు, జమీందారుల నుండి విముక్తి చేశారని అన్నారు. సుందరయ్య ఎమ్మెల్యేగా, ఎంపీగా సాధారణ జీవితం గడిపారని, పార్లమెంటుకు సైకిల్ మీద వెళ్లే వారిని అన్నారు. ఆయన స్ఫూర్తితో మనం కూడా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సుందరయ్య నాయకత్వంలో పోరాడి సాధించుకున్న హక్కులను కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం హరించి వేస్తుందని, మళ్లీ బిజెపి అధికారంలోకి వస్తే మొత్తం రాజ్యాంగాన్ని మారుస్తానంటుందన్నారు. రాజ్యాంగాన్ని మార్చడమంటే రిజర్వేషన్లు ఎత్తివేయడమేనన్నారు. గిరిజన, దళిత, కార్మిక, రైతు చట్టాలను మార్చి వేయడమేనన్నారు. వీటికి వ్యతిరేకంగా రానున్న రోజుల్లో సుందరయ్య స్ఫూర్తితో పెద్ద ఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు, గౌరి, జ్యోతి, లక్ష్మం నాయుడు, పారినాయుడు, విశ్వేశ్వరరావు, రామారావు, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డ వేణు, నాయకులు

జిందాల్ కార్మికులకు అండగా ఉంటాం


ఎంపిపి గోపమ్మ • నాలుగో రోజుకు నిరసన

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ కార్మికులకు అండగా ఉంటామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొత్తవలస ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ భరోసానిచ్చారు. జిందాల్ కార్మికుల నిరసన సోమవారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఎంపిపి గోపమ్మ మాట్లాడుతూ అర్థాంతరంగా లేఆఫ్ ప్రకటించడం దారుణమన్నారు. అవసరమైతే జిందాల్ కార్మికుల సమస్యలను మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి, తద్వారా పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు.

బేషరతుగా పరిశ్రమను తెరిపించాలి

జిందాల్ కర్మగారాన్ని యాజమాన్యం బేషరతుగా తెరిపించి, కార్మికులందరికీ పని కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. జిందాల్ యాజమాన్యం కార్మికులను రోడ్డుపైకి నెట్టిందని, ముందస్తు సమాచారం లేకుండా కంపెనీకి లేఆఫ్ ప్రకటించడాన్ని తప్పుబట్టారు. కంపెనీ మూసివేసి నాలుగు రోజులు గడుస్తున్నా యాజమాన్యం తీరులో మార్పు లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. విజయనగరం డిసిఎల్ వద్ద మంగళవారం చర్చలు జరగనున్నాయని, ఆ చర్చలు ఫలించే విధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, సిఐటియు నాయకులు గాడి అప్పారావు, కొత్తవలస, తుమ్మికాపల్లి, అప్పన్నపాలెం సర్పంచులు మచ్చ ఎర్రయ్య రామస్వామి, విరోతి కొండలరావు, కోన దేవుడు, బొంతల వెంకటరావు, టిఎన్‌టియుసి నాయకుడు పిల్ల అప్పలరాజు, సలాది భీమయ్య, నమ్మి చినబాబు, బొట్ట రాము, బాలిబోయిన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపిపి గోపమ్మ

మాట నిలబెట్టుకున్న జగన్

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఒకే ఒక్క నాయకుడు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం వివిధ సంక్షేమ లబ్ధిదారులకు సుమారు రూ.10 వేల కోట్లు అందిస్తే సిఎం జగన్‌కు ప్రజల్లో మరింత ప్రజాదరణ పెరిగి, ఓట్లు వేస్తారన్న అక్కసుతో కొంతమంది కుట్రదారులు పన్నాగం పన్నారని ధ్వజమెత్తారు. ముందే జమ కావాల్సిన డబ్బులపై కోర్టులకు వెళ్లడం, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయడం ద్వారా నిలుపుదల చేయించారని విమర్శించారు. ఇందుకు స్పందించిన ముఖ్యమంత్రి జగన్ ముందు నుంచీ ఇస్తున్న పథకాలను నిలుపుదల చేయవద్దని కోర్ట్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇప్పించారని చెప్పారు. ప్రస్తుతం ఆ నిధులను ప్రజల ఖాతాలలో జమ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఆసరా కింద పెండింగ్‌లో ఉన్న రూ.1200 కోట్లను గతంలో రాని మహిళలంతా నాలుగైదు రోజుల్లో తీసుకునే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇబిసి నేస్తం కింద 45 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న అర్హత ఉన్న ఒసి మహిళల ఖాతాల్లో సోమవారం నుంచి జమవుతాయని వెల్లడించారు. విద్యాదీవెన నిధులు తల్లుల ఖాతాలలో, రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ నిధులు జమైనట్లు చెప్పారు. నాలుగో విడత చేయూత పథకానికి సంబంధించి రూ.18,750 చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయని వివరించారు. కొంతమంది ఎన్ని కుట్రలు పన్నినా బెదరకుండా సిఎం జగన్ చెప్పిన మాట ప్రకారం నిధులు జమ చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలోనే కాదు.., ఎన్నికైన మరుసటి రోజు నుంచే ప్రజల సంక్షేమం, అభివృద్ధి గురించి ఆలోచించేది వైసిపి మాత్రమేనని పేర్కొన్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



మాట్లాడుతున్న డిఆర్ఒ కేశవనాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఇంటర్మీడియెట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24నుంచి జూన్ 7 వరకు జరుగుతాయని జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు అన్నారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో డిఆర్ఒ మాట్లాడుతూ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వాతావరణశాఖ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించినందున వర్షం వల్ల ఇబ్బందులు రాకుండా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో 17 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని ఆయన చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో కనీస సౌకర్యాలు - తాగు నీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనేలా బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలు రెండు పూటలా జరుగుతాయని, ఇంటర్ మొదటి సంవత్సరం వారికి ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు, ఇంటర్ రెండో సంత్సరం వారికి మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

తదనుగుణంగా బస్సులు నడపాలని ఆయన చెప్పారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పరీక్షల పేపర్లు నిర్దేశిత కేంద్రాలకు పంపించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని పోస్టల్ శాఖను కోరారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు పక్కాగా ఉండాలని పోలీసు శాఖకు సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన అన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి డి.మంజుల వీణ, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌టిసి, పోస్టల్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శిశువుల భవిష్యత్తు నాశనం చేయొద్దు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వారం రోజుల్లో ముగ్గురు శిశువులను కాలువల్లో, చెత్త కుండీల్లో వేసి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేయడం చాలా దురదృష్టకరమని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. యువత కొన్ని ప్రత్యేక పరిస్థితులు, దురలవాట్లు, చెడు స్నేహాల వల్ల గర్భం దాల్చి, జన్మనిచ్చిన శిశువును తమ నుంచి దూరం చేసుకోవడానికో, వదిలించుకో దారుణంగా నిర్మానుష్య ప్రదేశాలు, కాలువల్లో, పొదల్లో, చెత్త కుండీల్లో వేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎవరికైనా పిల్లల పెంపకం, పోషణ, సంరక్షణ కోసం ఇబ్బందికర పరిస్థితులు తలెత్తితే అటువంటి శిశువులను, బాలలను ప్రభుత్వ నిబంధనల మేరకు తీసుకొని, వారికి బంగారు భవిష్యత్తు కల్పిస్తామని తెలిపారు. అటువంటి శిశువుల కోసం జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ ఆస్పత్రిలో ఊయలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆ ఊయలలో ఇటువంటి శిశువులను వేస్తే వారిని ప్రభుత్వాధికారులు బాలల సంరక్షణ కేంద్రాల్లో ఉంచి దత్తత ఇస్తారని తెలిపారు. వదిలి వేసిన వారి వివరాలను కూడా గోప్యంగా ఉంచుతారని వెల్లడించారు. రాష్ట్రంలో వేల కుటుంబాల్లో పిల్లలు లేక దత్తత కోసం దరఖాస్తు చేసుకొని ఎదురుచూస్తున్నారనీ, వారికి ఈ పిల్లలను దత్తత ఇచ్చి సహాయం చేసిన వారవుతామని తెలిపారు. ఈ సంఘటనల నేపథ్యంలో స్థానికంగా ఉండే అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సచివాలయం సిబ్బంది... గర్భిణులపై నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో జరిగిన సంఘటనలపై పోలీసు అధికారులు విచారణ చేపడుతున్నారని తెలిపారు.

సంగీతం నేర్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యార్థులకు సంగీతం పట్ల అవగాహన కల్పిస్తే వారు దాంతోపాటు పాఠాలను కూడా అంతే శ్రద్ధతో నేర్చుకోగలరని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి అన్నారు. సోమవారం విజయనగరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడంతోపాటు షణ్ముఖ ప్రియ ఆధ్వర్యంలో సంగీతంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం కార్యదర్శి బి.లక్ష్మి వేసవి విజ్ఞాన శిబిరానికి వచ్చిన పిల్లలకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్థంతి సందర్భంగా మంగళవారం నగరంలోని అయ్యన్నపేట జంక్షన్‌లోని మదర్ థెరీసా కిడ్స్ స్కూల్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మదర్ థెరిసా క్లబ్ వ్యవస్థాపకులు త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా వచ్చి, రక్తదానం చేయాలని కోరారు.

లోలోపల భయం... పైపైకి గాంభీర్యం

కూడికలు, తీసివేతల్లో ప్రధాన పార్టీల నేతలు • గెలుపుపై ఎవరి ధీమా వారిదే

ప్రజాశక్తి - కురుపాం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసి వారం రోజులైంది. అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్ రూమ్ లోని ఇవిఎంల్లో నిక్షిప్తమై ఉంది. కౌంటింగ్‌కు మరో 15 రోజుల గడువు ఉండనే ఉంది. ఈలోగా పోటీలో అభ్యర్థులు, వారిని బలపరిచిన పార్టీశ్రేణులు, అభిమానులు ఎవరికి వారే పోలింగ్ సరళిని సమీక్షిస్తూ గెలుపు అంచనాలపై లెక్కలు వేసుకుంటున్నారు. లోలోప గుబులు ఉన్నా, పైకి మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. కురుపాం నియోజకవర్గంలో ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో 78.54 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో 77.8 శాతం నమోదైంది. గతం కంటే ప్రస్తుతం 1 శాతం పెరిగింది. నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు లక్షా 94 వేల 114 మంది ఓటర్లు ఉండగా, వారిలో లక్షా 54 వేల 450 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో మహిళలే ఎక్కువ మంది ఓటేశారు. గతం కంటే అధికంగా పోలింగ్ నమోదు కావడం, ముఖ్యంగా మహిళా ఓట్లు ఎక్కువగా పోలవ్వడం అది తమ విజయానికి సంకేతమని అటు వైసిపి, ఇటు టిడిపి ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

సంక్షేమ పథకాలపై వైసిపి విశ్వాసం

నియోజక వర్గంలో పోలింగ్ శాతం గతం కంటే ఎక్కువగా నమోదు కావడం, అందులోనూ మహిళా ఓటర్లు పెద్దసంఖ్యలో ఓట్లేయడంతో వైసిపిపై గెలుపుపై ఆశలు పెంచాయి. నవరత్న పథకాలను ఎక్కువగా మహిళా లబ్దిదారుల పేరునే ఇవ్వడంతో వారంతా తమకే ఓటు వేసి ఉంటారన్న వైసిపి గట్టినమ్మకంతో ఉంది. అమ్మఒడి, చేయూత, కాపు నేస్తం, ఇబిసి నేస్తం, డ్వాక్రా సున్నా వడ్డీ, జగనన్న ఇళ్లు, రైతుభరోసా, ఆరోగ్యశ్రీ, విద్యా, వసతిదీవెన వంటి సంక్షేమ పథకాలు తమకు ఓట్లు తెచ్చి పెడతాయని అధికార వైసిపి నేతలు, గ్రామస్థాయి నేతలు, కార్యకర్తలు లెక్కలు వేస్తున్నారు. 2024 మ్యానిఫెస్టోతో యువతలో కొత్త ఆశలు చిగురించాయని, కొత్తగా ఓటు వేసిన వారంతా తమ వెన్నంటే ఉన్నారని అంటున్నారు.



సూపర్ సిక్స్ పథకాలపై గంపెడాశలో టిడిపి ...

ఓటింగ్ సరళి చూస్తే ఫలితాలు తమ పార్టీకి అనుకూలంగా ఉన్నట్టు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. 2024 ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన సూపర్ సిక్స్ పథకాలు తమను గెలిపిస్తాయని టిడిపితో సహా కూటమి నేతలు అభిప్రాయపడుతున్నారు. ఏటా మూడు ఉచిత వంట గ్యాస్ సిలెండర్లు, మహిళలకు ఉచితంగా ఆర్‌టిసి బస్సు ప్రయాణం, 18 ఏళ్లు నిండిన మహిళలకు ప్రతినెలా రూ.1500 వంటి పథకాలను మహిళలు స్వాగతించారని, కూటమి పార్టీలకే ఓటేశారనడానికి పోలింగ్ సరళి తేటతెల్లం చేస్తుందని అంటున్నారు. యువతకు నెలసరి నిరుద్యోగభృతి రూ.3వేలు, 20లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, వంటివి యువతను ఆకర్షించి, కూటమికి ఓట్లేసేలా చేశాయని లెక్కలు వేస్తున్నారు. రైతులకు ఏటా రూ.20వేలు పెట్టుబడి సాయం గ్రామీణ ప్రాంతంలో రైతుకుటుంబాలు ఓట్లేసేలా చేసిందని, ఇక ప్రతి విద్యార్థికి రూ.20వేలు విద్యాసాయం అందరినీ మెచ్చేలా చేసిందని టిడిపి వర్గాలు భావిస్తున్నాయి. దీంతో అన్ని వర్గాల ప్రజలు పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా రాత్రి వేళల్లోనూ క్యూలైన్లలో నిల్చోబెట్టి కూటమికి ఓట్లు తెచ్చిపెట్టిందని అంటున్నారు. ఇలా ప్రధాన పార్టీలు రెండూ ఎవరికి వారే అంచనాలు వేసుకుంటున్నాయి.

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

పరాయి పంచన మండల పరిషత్, వ్యవసాయ శాఖ భవనాలు
ఇబ్బంది పడుతున్న అధికారులు



ఐటిడిఎ సముదాయంలో ఉన్న ఎంపిడిఒ కార్యాలయం

ప్రజాశక్తి - సీతంపేట

శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పాలనాపరంగా అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరాయి పంచన కొనసాగిస్తుయి. స్థానిక ఐటిడిఎలో మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయాలు మూడున్నర దశాబ్దాలుగా అధికారులు పరిపాలన వ్యవహారాలు పాత భవనాల్లోనే



శిథిలావస్థలో ఉన్న రైతు భరోసా కేంద్రం

కొనసాగిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయానికి సుమారు 40ఏళ్ల క్రితం స్థలం మంజూరైనప్పటికీ సకాలంలో నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఆ ప్రదేశంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణానికి కేటాయించారు. దీంతో ఐటిడిఎ కార్యాలయంలో గల సెరీకల్చర్ కార్యాలయంలోని మండల పరిషత్ కార్యాలయ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. సుమారు మూడున్నర దశాబ్దాలుగా ఈ కార్యాలయం పరాయి పంచనే ఉంది. మండలంలో 53 మంది సర్పంచులు, 17 మంది ఎంపిటిసి సభ్యులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది వీరందరికీ సమావేశాలు నిర్వహించడానికి గదుల్లేక అధికారులు అవస్థలు పడుతున్నారు. దీంతో సమావేశాలు వైటిసి భవనంలోనో, వెలుగు కార్యాలయంలోనూ నిర్వహించాల్సి దుస్థితి ఏర్పడింది. అంతేకాక కొన్ని కార్యాలయాల్లో వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజలతో ముడిపడి ఉన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎంపిటిసిలు, సర్పంచులు, జెడ్పిటిసి, ప్రజలతో ఎంతో రద్దీగా ఈ కార్యాలయంలో ఉంటుంది. అలాంటి కార్యాలయాన్ని శిథిలమైన భవనంలో విధులు నిర్వహిస్తున్నారు.

ఇక తహశీల్దార్ కార్యాలయానికి వస్తే 1987లో ఈ ఆఫీసును ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 35 ఏళ్లుగా అదే భవనంలో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయానికి నిత్యం విఆర్ఒలు, ప్రజలు అనేక పనుల నిమిత్తం వస్తూ పోతుంటారు. అయితే ఈ కార్యాలయం చిన్నది కావడంతో ఇరుకు గదుల్లోనే సమావేశాలు నిర్వహిస్తున్నారు. 2019లో అప్పటి ఐటిడిఎ పిఒ శివశంకర్ తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలను ఐటిడిఎ ప్రాంగణంలో శంకుస్థాపన చేశారు. ఆయన బదిలీ కావడంతో అక్కడితో ఆ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆ పనులను ఆ తర్వాత వచ్చే అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ కనీసం పట్టించుకోలేదు. ఐటిడిఎ ఆధ్వర్యంలో ఉన్న భవనాల్లో సీతంపేట ఒకటి, రెండు రైతు భరోసా కేంద్రంలు నిర్వహించారు. వీటిలో ఒకటి సీతంపేట వ్యవసాయ శాఖ కార్యాలయంగా నిర్వహిస్తున్నారు. వ్యవసాయశాఖకు సొంత భవనం లేక అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం ఉన్న రైతు భరోసా కేంద్రంలో ఎటువంటి భద్రత లేదు. వర్షాలు వస్తే కంప్యూటర్ తడిసిపోతాయో, ఎవరైనా దొంగిలించికుపోతారేమోనని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత భవనాలు నిర్మించాలని కోరుతున్నారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ ఆర్‌బికెలోనే వ్యవసాయ కార్యాలయం నిర్వహిస్తున్నామన్నారు. సెరీకల్చర్ కార్యాలయాన్ని మరమ్మతులు చేసి అందులో మండల పరిషత్ కార్యాలయం విధులు నిర్వహిస్తున్నామని ఇఒపిఆర్‌డి కె.సత్యం తెలిపారు. ప్రజా పతినిధులు సమావేశాలకు ఈ భవనం చాలడం లేదని తెలిపారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని బర్లి రైతు భరోసా కేంద్ర పరిధిలో జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ కె.రాబర్ట్‌పాల్ సమక్షంలో పచ్చిరొట్ట, జీలుగు విత్తనాలను రైతులకు సోమవారం పంపిణీ చేశారు. ప్రస్తుతం మండలంలోని 97.30 క్వింటాళ్ల జీలుగలు, 0.9 క్వింటాళ్ల కట్టెజనుము, 0.4 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు ముందస్తుగా రైతు భరోసా కేంద్రాల్లో నిల్వలు ఉంచినట్లు ఎఇ శ్రావణ్ కుమార్ తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు - ప్రయోజనాలపై అవగాహన తెలియజేయడం. ఈ పచ్చిరొట్ట విత్తనాలు భూమిలో వేసుకొని 30-45 రోజుల్లో లేదా పూత దశలో భూమిలో కలియదున్నాలని, 30-45 రోజులప్పుడు భూమిలో పదును ఉన్నప్పుడు రోటివేటర్‌తో పొడి దుక్కితో కలియదున్నాలని అన్నారు. ఇలా చేయడం వల్ల 9-10 టన్నుల పచ్చిరొట్ట నేలకు అందడం వల్ల భూసారం, నేల ఉత్పాదకత పెరుగుతుంది. నేల గుల్లబారి చౌడు విరిగిపోతుంది. కలుపును అదుపులో ఉంచుతుంది. నెలలో నీరు ఇంకే గుణం పెరుగుతుంది. గాలిలోని నత్రజనినీ స్థిరీకరిస్తాయి. సూక్ష్మజీవులు అభివృద్ధి పెరుగుతుంది. క్లిష్ట రూపంలో ఉన్న పోషకాలను లభ్య రూపంలోకి మారుస్తాయి. వీటిని భూమిలో కలియ దున్నడం వల్ల వచ్చే భూసారం వల్ల 5-10శాతం రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవాలి. జీలుగు, కట్టెజనుము విత్తనాలు 10 కేజీల పాకెట్ రూ.880 కాగా, సబ్సిడీపై రూ.440 వస్తుందన్నారు. పిల్లి పెసర విత్తనాలు 8 కేజీల ప్యాకెట్ రూ.1072కు గానూ సబ్సిడీపోనూ రూ.536కు వస్తుందన్నారు. కావున రైతులు ఈ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎ వేదుల చాందిని పాల్గొన్నారు.



బలిజిపేటలో పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్

సీతానగరం : మండలంలోని గుచ్చిమి రైతు భరోసా కేంద్రంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్ రైతులకు పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట భూమిలో వేయడం వల్ల నేలలో కర్బన శాతం పెరిగి నేల గుల్లబారి సారవంతంగా మారుతుందని, తదుపరి వేసిన పంటలు దిగుబడి పెరుగుతుందని తెలిపారు. రాయితీపై ఈ విత్తనాలు అందజేస్తున్నామని, కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎడిఎ టి.వెంకటేష్, మండల వ్యవసాయ అధికారి అవినాష్, విఎఎ ప్రణీత్, రైతులు పాల్గొన్నారు

పశువుల అక్రమ రవాణా నివారణకు
నోడల్ అధికారిగా హర్షిత

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

జిల్లా లో పశువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు కఠిన చర్యలు చేపడతామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఈమేరకు ఈ చర్యలు పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా నోడల్ అధికారిగా దిశా డిఎస్పీఎస్.ఆర్.హర్షితను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పశువుల అక్రమ రవాణా, కబేళాలకు తరలింపు నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టనున్నట్లుగా ఎస్పీ తెలిపారు. పశువుల అక్రమ రవాణా,కబేళాతరలింపు నియంత్రణకు ప్రతి పోలీస్ స్టేషన్ అధికారి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువుల అక్రమ రవాణకు సంబంధించిన సమాచారం సంబంధిత పోలీస్అధికారులకు లేదా నోడల్ అధికారి అయిన దిశా డిఎస్‌పి 89775 19102 నెంబర్ కు సమాచారం అందించాలని ఎస్‌పి సూచించారు.

టిటిడిలో ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక టిటిడి దేవస్థానంలో సోమవారం ప్రథమ వార్షికోత్సవం ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారికి రంగుమారిన నీటిని చూపుతున్న సిపిఎం నాయకులు

తాగు, వరద నీటి సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో కుళాయిల ద్వారా సరఫరా జరిగే తాగునీరు చాలా అధ్వాన్నంగా ఉందని, ఏమాత్రం చిన్నపాటి వర్షం కురిసినా పట్టణ ప్రధాన రహదారి జలమయమవుతుందని కావున ఈ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం పట్టణ నాయకులు గొర్లి వెంకటరమణ, బంకురు సూరిబాబులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇన్చార్జి మేనేజర్ దిబ్బా రుబేను, డిఇ పి.కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు కుళాయిల ద్వారా సరఫరా చేసే రంగు మారిన తాగునీటితో నింపిన సీసాను చూపించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు సరిపడే తాగునీటి సరఫరా చేయడం లేదని, మూడు, నాలుగు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. ఆ నీరు కూడా రంగు మారిన నీరు సరఫరా జరుగుతుందని, దీంతో పాటు పట్టణంలో ఏమాత్రం చిన్నపాటి వర్షం కురిసినా ప్రధాన రహదారిలో ఉన్న పలు కూడళ్లు వరద నీటితో జలమయమవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టకపోతే పట్టణంలో ఉన్న పలు వార్డుల ప్రజలతో నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.జయలక్ష్మి, పి.మహేష్, కె.మౌళి, పి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



పేదలకు గొడుగు, పండ్లు అందజేస్తున్న డిఎంఒ జగన్మోహనరావు

పేదలకు గొడుగులు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ టి.హేమాక్షి పేదలకు గొడుగులు, పండ్లు సోమవారం అందజేశారు. తన తండ్రి తెర్లి గౌరినాయుడు 18వ వర్ధంతిని పురష్కరించుకొని మండలంలోని బూర్జలో నిరుపేదలకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన తండ్రి వర్ధంతి సందర్భంగా ప్రతి ఏటా ఆనవాయితీగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తన తండ్రి వృత్తిరీత్యా కుష్టు రోగులకు 25 ఏళ్లుగా సేవలందించారని, వృత్తిలో ఉండగానే మృతి చెందారన్నారు. వృత్తిలోనూ, సేవా భావంలో ఆయన తమకెంతో స్ఫూర్తిదాయకమన్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రత దృష్ట్యా, రాబోయే వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని గొడుగులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అక్కడ ప్రజలకు అవగాహన కల్పించారు.



విద్యార్థులకు ప్రవేశ పత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపల్ ఉషారాణి

ఇంటర్ ప్రవేశాల కోసం ఇంటింటికీ కళాశాల సిబ్బంది

ప్రజాశక్తి - కురుపాం

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.ఉషారాణి తన సిబ్బందితో కలిసి సోమవారం కురుపాంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు, విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరమని కోరి అడ్మిషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలో కూడా అన్ని రకాల మౌలిక వసతులతో పాటు ల్యాబ్, నాణ్యమైన విద్యను అందిస్తామని తెలిపారు. కావున ప్రతి విద్యార్థి ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మురళి, ఆకుల రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కోడూరుకు అన్నమయ్య పురస్కారం

ప్రజాశక్తి - సాలూరు



పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త, శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు అన్నమయ్య పురస్కారాలు - 2024కు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనకు చిత్తూరు జిల్లాకు సంప్రదాయ కళల పరిరక్షణ సంస్థ, ఎఎస్ ఫౌండేషన్ నుంచి ఆహ్వానం అందింది. ఈనెల 26న చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం గొల్ల చీమనపల్లిలో నిర్వహించనున్న అన్నమయ్య పురస్కారాల ప్రదానోత్సవానికి హాజరు కావాలని కోరారు. కోడూరు సాయి శ్రీనివాసరావు సాంప్రదాయ కళల పరిరక్షణ లో, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణతో పాటు సొంతంగా పాఠశాల నిర్వహిస్తున్నారు.

గిరిజన గ్రామాల్లో దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన చెక్కాపురం, గెద్దకోల, గుజ్జీ తదితర గ్రామాల్లో సోమవారం సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు ఆధ్వర్యంలో మలాథియన్ పిచికారీ చేశారు. ఇళ్లలోనూ, బయట స్ప్రేయింగ్ చేస్తున్నామని తెలిపారు. మలేరియా ఎపిడిమిక్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని స్ప్రేయింగ్ చేస్తున్నామన్నారు. ప్రణాళిక ప్రకారం అన్ని గ్రామాల్లో ముందస్తుగా గ్రామస్తులకు తెలియజేసే పిచికారీ చేస్తున్నమన్నారు. వర్షాకాలంలో దోమల నివారణకు ఈ మందు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి, ఎంపిహెచ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కాపురంలో మలాథియన్‌ను స్ప్రే చేస్తున్న సిబ్బంది

తెలంగాణ మాదిరిగా గౌరవ వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

సాధారణ ఎన్నికల్లో సెక్టార్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించిన ఎంఇఒలకు, ఇతర శాఖల అధికారులకు తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన మాదిరిగా మన రాష్ట్ర ప్రభుత్వం ఒక నెల జీతం గౌరవ వేతనంగా చెల్లించాలని మండల విద్యాశాఖ అధికారుల సంఘం -1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం కోరారు. ఈ మేరకు ఎపి రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనాకు లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేశారు. ఎన్నికల విధులు నిమిత్తం గత ఏడాది నవంబర్ నుండి 2024 మే 14 వరకు సెక్టార్ ఆఫీసర్లుగా ఎన్నికల విధులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల విధుల గౌరవ వేతనాలకు సంబంధించి ఇటీవల మన పొరుగు రాష్ట్రం తెలంగాణలో జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో సెక్టార్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించిన వారికి ఒక నెల జీతం, గౌరవ వేతనంగా చెల్లించారన్నారు. కావున మన రాష్ట్రంలో కూడా మన పక్క రాష్ట్రం మాదిరిగా సెక్టార్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించిన ఎంఇఒలు, ఇతర శాఖల అధికారులకు ఒక నెల జీతం గౌరవ వేతనంగా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

ప్రిన్సిపల్‌ను రిలీవ్ చేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

డెప్యుటేషన్‌పై సీతానగరం మండలం జోగింపేట గిరిజనసంక్షేమ శాఖ ప్రతిభ పాఠశాల/కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న వెంకటనాయుడును తక్షణమే రిలీవ్ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన విద్యార్థి సంఘాల (జిఎస్‌యు, టిఎస్ఎఫ్) నాయకులు పాలక రంజిత్ కుమార్, పల్లా సురేష్, వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ గురుకుల అధికారులు అన్ని రకాల డెప్యుటేషన్లు రద్దు చేశారని, వెంకటనాయుడు మాత్రం తన రాజకీయ పలుకుబడితో నేటికీ రిలీవ్ కాలేదని తెలిపారు. తక్షణమే ఆయన్ను రిలీవ్ చేసి, వెంకట నాయుడుపై ఉన్న ఆరోపణలపై దర్యాప్తు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.



సాలూరులో కేక్ కట్ చేస్తున్న ఎన్టీయార్ అభిమానులు

ఘనంగా ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - సాలూరు

ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ 41వ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలో ఆయన అభిమానులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. వెంకటేశ్వరా డీలక్స్ సెంటర్‌లో బర్త్ డే కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో వున్న రోగులకు పండ్లు, రొట్టెలు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. అభిమాన సంఘం నాయకులు ప్రేమ్ విశ్వనాథ్, విజయ్, హేమంత్, నైన శ్రీను, జి.రమేష్, ఈ.రూపేష్, వెంకీ, పవన్ పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా జనసేన కార్యదర్శి బీపీ నాయుడు కె.ఇచ్చాపురంలో ఉన్న ఎండల మల్లేశ్వర ఆలయంలో ఎన్టీఆర్ ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి జనసేన జానీ, పాలకొండ నియోజకవర్గ నాయకులు ఎం .పుండరీకం ఉన్నారు.

మహాదేవివలసలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని చలివేంద్రి సచివాలయం పరిధి మహాదేవివలసలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి బి.సునీత, ఎఎన్ఎం ఎస్.పైడితల్లి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

గోతులు కప్పకపోతే ఆందోళన

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో అంతర్ రాష్ట్ర రోడ్డుపై ఏర్పడ్డ గోతులు కప్పకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులకు కొల్లి సాంబమూర్తి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. అంతర్‌రాష్ట్ర రహదారిపై కోటిపాం, గుమడ, కొమరాడ జూనియర్ కాలేజ్ సెంటర్ సమీపాన, ఈశ్వరుని దేవాలయం వద్ద, బంగారం పేట, ఇందిరా నగరం, చోళపదం సమీపాన, కూనేరు వద్ద ఉన్న పెద్ద పెద్ద గోతులను సిపిఎం నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన రెండున్నరేళ్లుగా ఇదే పరిస్థితి ఎక్కడైతే సిపిఎం ఇతర పార్టీలతో గోతుల వద్ద ఆందోళన చేస్తున్నా అక్కడే గోతులు తూతూ మాత్రంగా కప్పుతున్నారు తప్ప పూర్తి స్థాయిలో కప్పడంలేదన్నారు. దీంతో మళ్లీ గోతులు యథాస్థితికి వచ్చే పరిస్థితి ఉందన్నారు. జూన్ 10లోగా పనులు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆ గోతుల వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



గోతులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న మండల పశువైద్యాధికారి రామారావు

వర్షాకాలంలో వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

పశువులకు, గొర్రెలకు వర్షాకాలం వచ్చే వ్యాధుల పట్ల అవగాహన ఉండాలని మండల పశువైద్యాధికారి ఎస్.రామారావు అన్నారు. స్థానిక పశు వైద్య కేంద్రంలో పశు సంవర్ధకశాఖ సిబ్బందితో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో గ్రామాల్లో పశువులకు టీకాలు వేశామన్నారు. ఇందులో భాగంగా 1620 పశువులకు, 125 గొర్రెలకు టీకాలు వేశామన్నారు. వర్షాకాలం ప్రారంభంలో పశువులకు జబ్బువాపు, ఇతర వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో పలువురు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చెత్త తొలగింపు
'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రమైన మక్కువలో సువర్ణముఖీ నది వంతెన సమీపంలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు, కొబ్బరి బొండాలను సోమవారం అధికారులు తొలగించారు ఆదివారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన ఇదిగో.. దోమలకు ఆవాసం అన్న వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం అధికారులు సువర్ణముఖీ నది సమీపాన పేరుకుపోయిన కొబ్బరి బొండాల దిబ్బలను, చెత్తాచెదారాలను తొలగించి పరిశుభ్రం చేశారు.

22న గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ ఆధ్వర్యంలో సీతంపేటలో నిర్వహిస్తున్న బాలుర, బాలికల గురుకుల కళాశాల్లోనూ, అలాగే మండలంలోని పెద్దమడి బాలుర గురుకుల కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 22న కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు పిఒ శుభం బన్సల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని అన్నారు

సాంస్కృతిక కార్యక్రమాలు నిషేధం

ప్రజాశక్తి - మక్కువ

ఎన్నికల సందర్భంగా 144వ సెక్షన్లో అమలు ఉన్నందున జూన్ 6 వరకు ఎటువంటి సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించరాదని ఎస్ఐ పి.నరసింహమూర్తి తెలిపారు ఓట్ల లెక్కింపు అనంతరం 144 సెక్షన్ సడలింపు జరగనుందన్నారు. అంతవరకు మండలంలో ఏ ఒక్కరూ బహిరంగంగా సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించరాదని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

జిసిసి కార్యాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన సహకార సంస్థ బ్రాంచి కార్యాలయాన్ని సోమవారం జిసిసి ట్రాన్స్‌పోర్ట్ మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ సందర్శించారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలంలో హెచ్‌పిసిఎల్ పెట్రోల్ బంకు ఏర్పాటుకు కేటాయించిన ప్రదేశాన్ని పరిశీలించారు. పొజిషన్ సర్టిఫికేట్ వెంటనే తీసుకుంటే పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం సీతంపేట జిసిసి కార్యాలయాన్ని సందర్శించి మార్కెటింగ్‌పై జిసిసి మేనేజర్ డి.కృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిఎం జి.సంధ్యారాణి, సూపరింటెండెంట్ ధర్మారావు, అకౌంటెంట్ చినబాబు, రాము, సేల్స్‌మెన్లు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం కూడా కొనసాగింది. శిక్షణలో భాగంగా డ్రాయింగ్ మాష్టర్ జి.మురళి పిల్లలకు డ్రాయింగ్, పాటలు, డాన్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో చాలా మంది పిల్లలు పాల్గొన్నారు. మంగళవారం మట్టితో బొమ్మలు తయారు చేయడం ఎలాగో మురళి మాష్టర్ నేర్పిస్తారు. పాల్గొన దలచిన వారు మట్టి తెచ్చుకోవాలని ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

వికలాంగ పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

18ఏళ్లలోపు వికలాంగ పిల్లలను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్టు భవితకేంద్రం ఐసిఆర్‌పిలు యర్రా వీర్రాజు, విజయలలిత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో సోమవారం 18 ఏళ్లలోపు వికలాం గ పిల్లలను గుర్తించేందుకు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిఆర్‌పిలు మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలను గుర్తించేందుకు మండల కేంద్రంలో సర్వే నిర్వహించామన్నారు. సర్వే కార్యక్రమం జూన్ 8 వరకు నిర్వహిస్తామన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

మద్యం తాగొద్దని మందలించినందుకు మనస్తాపానికి గురై ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పాంచాలిలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పాంచాలికి చెందిన కలువలపల్లి రాంబాబు (44) మద్యానికి బానిసై ఇంటి, పొలం పనులు చేయకుండా ఉచితంగా తిరిగేవాడు. ఈనెల18న అతని భార్య జ్యోతి మద్యం తాగొద్దని పొలం పనులకు రావాలని భర్తను మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన రాంబాబు ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగాడు. ఇది గమనించిన భార్య వెంటనే సాలూరు ప్రభుత్వానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విజయనగరం సర్వజనీన ఆసుపత్రికి తీసుకొచ్చారు. అనంతరం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ నారాయణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన రాంబాబు